క్లుప్తంగా

నేటి నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన రమాసత్యన్నారాయణస్వామి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతుల సహకారంతో ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులు పాల్గొని మహాకుంభాభిషేక మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ కోరారు.

గడ్డివామి దగ్ధం



కత్తిపూడిలో గడ్డివామిపై మంటలను ఆర్పుతున్న దృశ్యం

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు దూది సామేల్ విద్యుత్ వైర్ల కింద గడ్డి వామి వేశాడు. పైన విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ అయ్యి గడ్డి వామిపై నిప్పు పడి మంటలు వ్యాపించాయి. దీంతో గడ్డివామి అగ్నికి ఆహుతైంది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్టు బాధిత రైతు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పాతకొట్టాంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న నాయకులు

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. కాజులూరు మండలం దుగ్గుదుర్రుకు చెందిన వేదపండితులు పూజ్యం నాగేశ్వరరావుశర్మ, సాయిసూర్య సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం 9.45 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, గరుడాళ్వారు, బలిపీఠం, శిఖర, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, సర్పంచ్ పసగడుగుల వరహాలు, ఉప సర్పంచ్ బొంగు గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు వేంకటేశ్వరస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, దార్ల సూర్యచంద్ర, సుర్ల రాజు, దొగ్గా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ అగ్రస్థానం



సమావేశంలో మాట్లాడుతున్న బాదం బాలకృష్ణ

సామర్లకోట: పేదలకు సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ అగ్రస్థానంలో ఉన్నదని క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక అయోధ్యరామపురం శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం క్లబ్ రీజనల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామర్లకోట క్లబ్ జిల్లాలో ఉత్తమంగా దూసుకుపోతోందని అన్నారు. ఇక్కడి క్లబ్ సభ్యుడు ఈదల ఈశ్వరకుమార్ వచ్చే ఏడాది జిల్లా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు తెలిపారు. క్లబ్ మొదటి వైస్ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ మాట్లాడుతూ తాను గవర్నరుగా బాధ్యతలు స్వీకరించే సమయంలో సేవా కార్యక్రమాలు మరింత పెంచడంతో పాటు సభ్యుల సంఖ్య పెంచడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమానికి రీజనల్ చైర్ పర్సన్ చిత్తూలూరి శ్రీదేవి అధ్యక్షత వహించి ఏటా రీజనల్ సమావేశం నిర్వహించాలన్నారు. ముఖ్య అతిథులను చిత్తూలూరి శ్రీదేవి, లయన్స్ క్లబ్ కో ఆర్డినేటర్ చిత్తూలూరి వీర్రాజు సత్కరించారు. జిల్లాలోని ఉత్తమ క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ లయన్స్ క్లబ్ గవర్నర్లు లింగమల్లు కృష్ణమూర్తి, కొడూరి రంగారావు, 2వ వైస్ గవర్నర్ వి.కోటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ, కార్యదర్శి వై.రామలింగ ప్రసాద్, కో ఆర్డినేటర్ సీహెచ్ శ్రీరామ గణేష్‌ప్రసాద్, మహిళా ప్రతినిధులు సీహెచ్ సాయిప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలవండి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- పల్లపు చామవరం, రాజవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



పల్లపు చామవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు



రాజారంలో పార్టీలో చేరిన వారితో ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు కోరారు. మండలంలోని పల్లపు చామవరం, రాజవరం గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలించిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పాలనను తీసుకువచ్చారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

మండలంలోని శృంగవరం, పి.చామవరం గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా కలసికట్టుగా పని చేసి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఎంపీపీ పర్వత రాజుబాబు, పార్టీ నేత వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు ఏసుబాబు, గుండబోలు రాజు, గుండబోలు కొండబాబు, దెయ్యాల అప్పారావు, కామిరెడ్డి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, ఎంపీటీసీ సభ్యుడు సోమరౌతు నాని, సోమరౌతు తిరుముల వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 100 మంది చేరిక

శంఖవరం: మండలంలోని గౌరంపేట పంచాయతీ రాజారం గ్రామానికి చెందిన 100 మంది ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీపీ పర్వత రాజుబాబు ఆధ్వర్యంలో 100 మంది టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరగా వీరికి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈగల అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పర్వత వివేక్, ఆచంట వెంకటేశ్వరరావు, ఎడ్ల సత్యనారాయణ, కోన బాబ్జి, ఈగల మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



శృంగవరంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న వరుపుల సుబ్బారావు

కేంద్ర పోలీసు బలగాల కవాతు



తుని కొండవారిపేటలో యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ గీతా రామకృష్ణ

తుని: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ అన్నారు. తుని పట్టణ పరిధిలోని 30 వార్డుల్లో ఆదివారం కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. పట్టణ సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రైవర్స్ కాలనీ, రెల్లికాలనీ, కొండవారిపేట, సీతారాంపురం, అమ్మాజీపేట తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ చేశారు. కొండవారిపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద యువతకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 11 నుంచి 30 వార్డుల్లోనూ కవాతు నిర్వహించి సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని వివరించారు. స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు రాంజీ
- కాండ్రేగులలో ఎన్నికల ప్రచారం



కాండ్రేగులలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట రాంజీ

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ అన్నారు. మండలంలోని కాండ్రేగులలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నేతలు వరుపుల సూరిబాబు, బొదిరెడ్డి చక్రరావు ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్ర మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, పార్టీ నేతలు పెద్దాడ రాజబాబు, గఫూర్, జగాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి
- తాళ్లూరులో ఎన్నికల ప్రచారం



తాళ్లూరులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న తోట వాణి, శ్రీనిధి

గండేపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. మండలంలోని తాళ్లూరులో ఆదివారం తోట వాణి, ఆమె కోడలు శ్రీనిధి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒబిణ్ని సత్యనారాయణ, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, పార్టీ నేతలు సానిపిని తారకం, జక్కిలింక రామకృష్ణ, పాలచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ నివారణ

- ఘనంగా ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



రాజపూడిలో ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



గోకవరంలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: క్షయవ్యాధి (టీబీ)ని అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఎంపీహెచ్ఈఓ డీఎస్ మూర్తి, ఎస్‌టీఎస్ వి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గోకవరం పంచాయతీ కార్యాలయంలో ఆదివారం క్షయవ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. అన్ని పీహెచ్‌సీలోనూ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజమహేంద్రవరంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర చేతుల మీదుగా టీబీ వ్యాధి నివారణకు ఉత్తమ సేవలందించి ప్రశంసాపత్రాలు అందుకున్న ఎంఎల్‌హెచ్‌పీ శ్రీవిద్య, ఏఎన్ఎం కె.బేబీ, ఆశావర్కర్లను ఆరోగ్య సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ, సిబ్బంది రమ్యశ్రీ, అనూష, సూర్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణ దినోత్సవం

జగ్గంపేట: మండలంలోని రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.పూజ మాట్లాడుతూ క్షయవ్యాధి గుర్తింపునకు ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వ్యాధిగ్రస్తులు ఈ పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్షయవ్యాధికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేసి క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



ఏలేశ్వరంలో మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

ఏలేశ్వరం: పట్టణంలో మట్టల ఆదివారం పండగను ఘనంగా నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చి పాస్టర్ కె.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక దిబ్బలపాలెం లూథరన్ చర్చి నుంచి బాలాజీ చౌక్, మెయిన్ రోడ్ మీదుగా మట్టలతో ర్యాలీ చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించడం ద్వారా ప్రపంచ శాంతి నెలకొంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘస్తులు మద్రిపూడి మనోహర్, పేకల జాన్, బాద సుమలత, శేఖర్‌బాబు, గాంధీ, విజయలక్ష్మి సుదర్శన్, డేవిడ్‌రాజు, గణేష్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలవ్యాప్తంగా ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని మట్టల ఆదివారం వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు ఏసుక్రీస్తు బోధనలపై ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. అనంతరం లూథరన్, బాప్టిస్ట్ తదితర చర్చిల ఆధ్వర్యంలో గ్రామాల్లో మట్టలతో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

కిర్లంపూడి: గ్రామంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు గోవర్ధనం శ్రీధరాచార్యులు, లీలా కృష్ణచైతన్యాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల పుష్పాలతో స్వామివారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక వాహనంలో మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడువ స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కిర్లంపూడిలో వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎండుగడ్డికి భలే గిరాకీ

కోటనందూరు: వ్యవసాయంలో యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చాక వరి ఎండుగడ్డికి గిరాకీ పెరిగింది. వరిపంటను మెషీన్‌తో కోయిస్తే పశువులు తినిడానికి అనువైన ఎండుగడ్డి వచ్చే పరిస్థితి ఉండదు. మెట్ట ప్రాంతమైన కోటనందూరు మండలంలో అవసరం మేర కూలీలు అందుబాటులో ఉండడంతో వరిని యంత్రాలతో కోసే పరిస్థితి లేదు. దీంతో ఈ ప్రాంతంలో ఎండుగడ్డి రైతుల అవసరానికి మించి ఎక్కువగా అందుబాటులో ఉంటోంది. ఈ ప్రాంతంలో ఏటా జనవరి నుంచి ఏప్రిల్ వరకూ వరికుప్పలు నూర్పిడి చేయడం పరిపాటి. ప్రస్తుతం కోనసీమతో పాటు ఇతర ప్రాంతాలకు ప్రతిరోజూ ఇక్కడ నుంచి భారీగా ట్రాక్టర్లపై ఎండుగడ్డిని తరలిస్తున్నారు.

ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.12 వేల నుంచి దూరాన్ని బట్టి రూ.20 వేల వరకూ పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. అవసరానికి మించి అందుబాటులో ఉన్న రైతులు గడ్డిని విక్రయిస్తున్నారు.



ట్రాక్టర్‌పై తరలిస్తున్న ఎండుగడ్డి

అధిక దిగుబడికి సస్యరక్షణ

- మామిడి పంటను ఆశిస్తున్న తెగుళ్లు
- సస్యరక్షణ చర్యలు పాటించాలంటున్న అధికారులు
- వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- మెట్టలో 20,686 ఎకరాల్లో సాగు



తేటగుంటలో మామిడి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

తుని రూరల్: మామిడి సాగు చేసిన రైతులు సమగ్ర సస్యరక్షణ, తెగుళ్ల నివారణ చేపట్టడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారులు పేర్కొన్నారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో బుధ, గురువారాల్లో మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వర్షం పడింది. ఈ వర్షాభావంపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులను గమనిస్తూ యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచిస్తున్నారు.

పది మండలాల్లో...

కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతంలో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట, గండేపల్లి, గోకవరం మండలాలు ఉన్నాయి. ఈ పది మండలాల్లో 12,073 మంది రైతులు 20,686 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం 50 నుంచి 60 శాతం తోటల్లో పూత, పిందెలు వచ్చాయి. పంట ప్రస్తుతం పిందెలు, కాయ దశలో ఉండగా పండు ఈగ, పక్షి కన్ను, కాయపుచ్చు తెగుళ్లు ఆశిస్తున్నాయి. తెగుళ్ల నివారణ చర్యలతో పాటు ఫ్రూట్ కవర్లు వాడితే మంచి రంగు, పరిమాణంతో నాణ్యమైన మామిడి దిగుబడులు లభిస్తాయని తుని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి తెలిపారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఆమె వివరించారు.

పండు ఈగ తెగులు

లేత గోధుమ రంగు రెక్కలు కలిగిన పండు ఈగ మామిడి కాయపై గుడ్లు పెడతాయి. ఒక్కరోజులోనే గుడ్లు పగిలి లార్వాగా మారతాయి. మాగీమాగని కాయల్లో గుజ్జును తినడంతో కాయలు నేలరాలిపోయి నష్టాన్ని కలిగిస్తాయి.

నివారణ

మోనో క్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఫెనథీయాన్ ఒక మిల్లీ లీటరు లేదా మిథైల్ డెమటాల్ రెండు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రాలిన పండ్లను సేకరించి నాశనం చేయాలి. ప్రతి 20 చెట్ల మధ్య ఆకర్షణకు ఎర్ర పళ్లెం ఉంచాలి. అందులో పది మిల్లీ లీటర్ల మిథైల్ యూజనల్‌తో పాటు 20 మిల్లీ లీటర్ల మాలథీయాన్ మందును 200 మిల్లీ లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని ఒక్కొక్క ఎర్ర పళ్లెంలో నింపాలి. ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది లింగాకర్షక బుట్టను ఏర్పాటు చేయడం ద్వారా మగ పండు ఈగను నియంత్రించవచ్చు.

పక్షి కన్ను తెగులు

లేత ఆకులు, లేత రెమ్మలు, పూలకాడలు, కాయల మీద తెగులు మచ్చలు కనిపిస్తాయి. వర్షాకాలంలో ఆకుల మీద లేత చిగుళ్లమీద అండాకారంలోగాని, నిర్దిష్టమైన ఆకారం లేకుండా బూడిద రంగు మచ్చలు వ్యాపించి రెమ్మలు ఎండిపోతాయి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మామిడి కాయలు నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్లు వినియోగించాలి. నీలి, పసుపు రంగు జిగురు పూసిన అట్టలను తోటలో ఏర్పాటు చేసుకోవాలి. అవసరాన్ని బట్టి పురుగు మందులు ఉదయం, సాయంత్ర వేళల్లోనే పిచికారీ చేయాలి. ఎరువుగా పశువుల పెట్ట వేయడం మంచిది. దిగుబడులు లభిస్తున్నప్పుడే కాకుండా తెగుళ్ల, పురుగులు నివారణకు కోతలు అనంతరం యాజమాన్య పద్ధతులు చేపట్టాలి. ద్రోణి ప్రభావంతో కురిసే వర్షాలకు పిందెలు, కాయలపై ఉన్న మామిడికి నష్టం కలగదు.

– జి.విజయలక్ష్మి, హెచ్ఓ, తుని

నివారణ ఇలా...

మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండిజిం లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. పూత, కాయ సమయంలో థయోఫెనేట్ మిథైల్ ఒక గ్రాము లేదా క్లోరోథాలోనిల్ రెండు గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాయపుచ్చు తెగులు

గులాబి రంగు చార కలిగిన తెల్లటి లద్దెపురుగు కాయ అడుగున రంధ్రం చేసి తోలు, కండను తిని సారంగాన్ని ఎర్పరుచట వలన పుచ్చు వస్తుంది.

నివారణ

కోత తర్వాత ఎండుకొమ్మలు, కాండం పగుళ్లలో ఉన్న గొంగళి పురుగులను నాశనం చేయాలి. ఆపై వేపగింజల కషాయం ఐదు శాతం, వేపనూనే ఒక శాతం కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

యూనియన్ ఐక్యతతో సమస్యల పరిష్కారం

బాలాజీచెరువు: యూనియన్ ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని ఏపీ పోస్టల్ ఎస్ఎఫ్‌సీఈ సర్కిల్ కార్యదర్శి బి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయంలో ఆదివారం తపాలా గ్రూప్-సి, పోస్ట్‌మాన్, ఎంటీఎస్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ విధులను చిత్తశుద్ధితో నిస్వార్థంగా నిర్వహించాలని సూచించారు. యూనియన్‌లో సీనియర్ నాయకుల పోరాట పటిమను, వారు సాధించిన విజయాలను వివరించారు. అనంతరం పోస్టల్ పెన్షనర్స్ ఉద్యోగుల కాకినాడ సంఘ అధ్యక్షులు తరుగా సూర్యారావును సత్కరించారు. ఈకార్యక్రమంలో తపాలా ఉద్యోగులు,పెన్షనర్స్

వైభవంగా శ్రీపుష్పయాగం

బొట్లకట్: స్థానిక మెహర్‌నగర్‌లో అలివేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామివారి 50వ వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆలయ ప్రధానార్చకులు పున్నమరాజు శ్రీనివాసాచార్యులు కమలాకర్ ఆచార్యులు ఆధ్వర్యంలో పూర్ణాహుతి, సాయంత్రం శ్రీపుష్పయాగం నిర్వహించారు. అనంతరం పవళింపుసేవ కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లిపూడి వెంకటేష్ కుమార్తెలు శ్రీయ, అక్షయ భక్తిగీతాలు ఆలపించారు. ఈ నెల 30 తేదీ వరకు ప్రతిరోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలసంబరం జరుగుతాయని చివరి రోజు 31వ తేదీ ఆదివారం మధ్యాహ్నం మహాన్నదానం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.